అన్నదాతను ముంచిన వర్షం


వాలిపోయి వర్షపు నీట మునిగిన వరి పంట


మొలకలు వస్తున్న ధాన్యం

- 400 ఎకరాల్లోని పంట నీటిపాలు
- ఎడతెరిపివ్వని వర్షం
- మొలకెత్తుతున్న ధాన్యం
- ఆవేదన చెందుతున్న రైతులు
- ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి

సోమశిల : అన్నదాతలను వర్షం నట్టేట ముంచింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట నీటి పాలైంది. వర్షం ఎడతెరపివ్వక చేతికొచ్చిన పంట నాలుగురోజులుగా నీటిలో నానుతూ మొలకలు వస్తుండడంతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. అనంతసాగరం మండలంలో ఎడగారు పంటకోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పాతదేవరాయపల్లి, మంగుపల్లి, కొత్తపల్లి, ముత్తుకూరు, పాతాళపల్లి, చిలకలమర్రి, తదితర గ్రామాల్లో సుమారు 400 ఎకరాల్లోని కోతకు వచ్చిన వరి పంట నేలవాలి నీట మునిగింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పొలాల్లో నీరు నిల్వ ఉండి ధాన్యం నానిపోయి మొలకలు రావడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికొచ్చే సమయంలో వర్షాలకు నీటిపాలైందని రైతులు వాపోయారు. ఎకరాకు సుమారు రూ.35వేల వరకు పెట్టుబడులు పెట్టామని, కనీసం పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

ప్రభుత్వానికి నివేదిక పంపాం

వర్షానికి నీట మునిగి దెబ్బతిన్న పంట పొలాలను గ్రామ వ్యవసాయ సహాయకులు పరిశీలించి నివేదిక ఇచ్చారు. ప్రభుత్వానికి నివేదిక పంపాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే మునిగిన పంటను పరిశీలించి నిబంధనల ప్రకారం 35 శాతం కంటే అదనంగా పంట దెబ్బతింటే నష్టపరిహారం అందించే విధంగా చర్యలు తీసుకుంటాం. – శైలజాకుమారి, ఏఓ

పంట పొలాలను ముంచెత్తిన నల్లవాగు


చేజర్ల–టీకేపాడు మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న నల్లవాగు


చేజర్ల మండలం టీకేపాడులో నీట మునిగిన పంట పొలాలు

ఆత్మకూరు: చేజర్ల మండలంలోని పంట పొలాలను నల్లవాగు ముంచెత్తింది. గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తోడు ఎగువ నుంచి వరద వస్తుండడంతో సోమశిల జలాశయం నుంచి దక్షిణ కాలువకు అధికంగా నీటిని విడుదల చేస్తున్నారు. ఈ ప్రవాహం కండలేరు కాలువ సామర్థ్యానికి మించి ఉండడంతో యనమదల, చేజర్ల మీదుగా వెళ్లే నల్లవాగుకు కొంత మేర నీటిని వదిలేస్తున్నారు. దీనికితోడు ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో నల్లవాగు ఉధృతంగా ప్రవహిస్తూ పరీవాహక ప్రాంతంలోని పొలాలను ముంచెత్తింది. దీనికితో శనివారం రాత్రి కురిసిన జోరు వర్షంతో వరి పొలాల్లో మోకాటి లోతుకుపైగా నీరు చేరింది. దీంతో కోత దశలోని వరి పైరు నేలవాలిపోయి నీట మునగడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలల క్రితం ఎడగారు పంటకు నల్లవాగు ద్వారా ఎక్కువ సాగునీరు విడుదల చేయాలని సోమశిల ప్రాజెక్ట్ ఎస్ఈని కోరామని, అప్పట్లో నల్లవాగు 250 క్యూసెక్కుల కంటే ఎక్కువ నీటి సామర్థ్యాన్ని తట్టుకోలేదని చెప్పారని రైతులు తెలిపారు. ప్రస్తుతం దక్షిణ కాలువ నుంచి నల్లవాగుకు పది వేల క్యూసెక్కులపైగా నీటిని ఎలా వదులుతున్నారని రైతులు ప్రశ్నిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టి ఆరుగాలం కష్టపడి పండించిన వరి పంట కోత దశలో నీటిపాలైందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

రెండెకరాల్లోని పంట నీటిపాలైంది



ఈ ఏడాది ఎడగారుకు సాగునీరు ఇవ్వడంతో రెండెకరాలు మాగాణి కౌలుకు తీసుకుని వరి సాగుచేశా. పంట బాగా దిగుబడి వచ్చింది. ఇక కోద్దామనుకుంటుండగా వర్షం కురవడంతో పంట వాలిపోయి నీటి మునిగింది. వర్షం ఎడతెరిపివ్వకపోవడంతో ధాన్యం నుంచి మొలకలు వస్తున్నాయి. వర్షం ఎడతెరిపిచ్చి పంటను కోసినా కొనుగోలు చేస్తారో..లేదో తెలియడం లేదు. ఎడగారు సాగుచేసి పూర్తిగా నష్టపోయా. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం అందించి ఆదుకోవాలి.

– ఇమ్మరాజు అంకయ్య పాతదేవరాయపల్లి

విద్యుత్ సరఫరాలో అంతరాయంపై ఆరా


రోగులను ఆరాతీస్తున్న ఆర్డీఓ పావని

ఆత్మకూరు: ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిని ఆర్డీఓ బీ పావని ఆదివారం సందర్శించారు. శనివారం రాత్రి ఆస్పత్రిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో సుమారు గంటకుపైగా రోగులు ఇబ్బందులు పడ్డారు. ఈ విషయం సోషల్ మీడియా ద్వారా జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దృష్టికి వెళ్లడంతో. వారి ఆదేశాల మేరకు ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ మునికృష్ణ, డీఎస్పీ కే వేణుగోపాల్‌తో కలిసి ఆర్డీఓ ఆస్పత్రిని సందర్శించారు. జనరేటర్‌ను పరిశీలించి సిబ్బందితో ఆన్‌చేయించి చూశారు. అనంతరం వార్డుల్లోని రోగుల వద్దకు వెళ్లి విద్యుత్ సరఫరాలో అంతరాయంపై ఆరాతీశారు. కొద్దిసేపు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది వాస్తవమేనని వారు ఆర్డీఓ దృష్టికి తెచ్చారు. అనంతరం ఆస్పత్రి ఆవరణలో డాక్టర్ మునికృష్ణ అధికారుల సమక్షంలో విలేకరులతో మాట్లాడారు.వర్షం కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిందని తెలిపారు. జనరేటర్ మరమ్మతులకు గురవలేదని, వర్షం కారణంగా దానిని ఆన్‌చేయడంలో కొంత ఆలస్యమైందన్నారు. ఈలోగానే కొందరు చీకట్లో ఉన్న వార్డుల ఫొటోలను సోషల్‌మీడియాలో వైరల్ చేశారని తెలిపారు. ఆస్పత్రిలో ఎలాంటి సమస్యలు లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వారి వెంట సీఐ ఎం గంగాధరం, నాయకులు టీ చంద్రారెడ్డి, కుడుముల సుధాకర్ రెడ్డి, సున్నా సంతోష్‌కుమార్, పిడికిటి వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం



కావలి(అల్లూరు): కావలిలోని డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో సిక్స్ ఏ సైడ్ హ్యాండ్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలను గురువారం నిర్వహించారు. హోరాహోరీగా సాగిన పోటీల్లో పురుషుల విభాగంలో కర్నూల్, కడప, నంద్యాల, మహిళల విభాగంలో కడప, నంద్యాల, నెల్లూరు క్రీడాకారులు వరుసగా మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. విజేతలకు డీబీఎస్ కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్ నాయుడు బహుమతులను ప్రదానం చేసి అభినందించారు. కళాశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

మర్రిపాడు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఈ నెల 24వ తేదీ వరకు ఈదురుగాలులు, పిడుగులతో కూడిన అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ నుంచి హెచ్చరికలు వస్తున్న నేపథ్యంలో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ అనిల్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యే అవకాశం ఉందన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు వారిని అప్రమత్తం చేస్తూ ఎటువంటి ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని గ్రామ రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బందికి సూచించామన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు మర్రిపాడు తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూము నంబర్ 76718 71710 ఫోన్ చేస్తే తక్షణమే సహాయం అందజేస్తామని తెలిపారు.

వర్షాలకు దెబ్బతిన్న పెంకుటిళ్లు



కలిగిరి: స్థానిక పాతూరులో కొండపల్లి వెంకటేశ్వర్లుకు చెందిన పెంకుటిల్లు వర్షాలకు దెబ్బతింది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఇంటిపైకప్పు పెంకులు బాగా నానిపోయాయి. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి ఇంటి సమీపంలో పిడుగు పడడంతో పైకప్పు కూలిపోయింది. దీంతో ఇంట్లోని టీవీ, మంచాలు, ఇతర సామగ్రి దెబ్బతిన్నాయి. ఆ సమయంలో కుటుంబసభ్యులు పంచలో ఉండడంతో పెనుప్రమాదం తప్పింది.

రోడ్డును కమ్మేసిన కంపచెట్లు



వరికుంటపాడు: మండలంలోని వరికుంటపాడు–జీ కొండారెడ్డిపల్లి రోడ్డును కంపచెట్లు కమ్మేశాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్డుకు ఇరువైపుల కంపచెట్లు దట్టంగా పెరిగాయి. ప్రధానంగా మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించని విధంగా రోడ్డును ఆక్రమించడంతో వాహనచోదకులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. బోయమడుగుల రైతులు సైతం తమ పొలాల్లోకి వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంపచెట్లను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బోరుకు మరమ్మతులు చేపట్టరూ..



ఉదయగిరి రూరల్: గండిపాలెం జలాశయం సమీపంలోని ఈద్గా వద్ద ఉన్న బోరు మరమ్మతులకు గురైంది. పొలాల్లోకి వెళ్లేవారు, పశువుల, జీవాల కాపర్లు, ఈద్గాకు వచ్చే వారు బోరు వద్ద దాహార్తి తీర్చుకుంటుంటారు. బోరు మరమ్మతులకు గురవడంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి బోరుకు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

వర్షపు నీరు తొలగింపు



ఆత్మకూరురూరల్: వాశిలి ఎస్సీ కాలనీలోని వీధుల్లో వర్షపు నీరు నిల్వ చేరడంతో స్థానికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని సర్పంచ్ చెలికా రమాహరిబాబు దృష్టికి తీసుకెళ్లడంతో ఆదివారం వర్షపు నీటిని తొలగించేందుకు చర్యలు చేపట్టారు. డ్రైనేజీలు లేకపోవడంతో వర్షం పడిన ప్రతిసారి ఇబ్బందులు పడుతున్నామని, అధికారులు స్పందించి డ్రైనేజీ నిర్మాణం చేపట్టి శాశ్వతంగా సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరారు.

క్లుప్తంగా

పర్యావరణహిత దీపావళిని జరుపుకోండి


మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆత్మకూరు నియోజకవర్గ ప్రజలకు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. నరకాసురుడిని వధించి శక్తిస్వరూపిణి సత్యభామ లోకానికి విముక్తి కల్పించిన సందర్భంగా దీపావళిని జరుపుకోవడం ఆనవాయితీ అని, చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా ప్రతిఒక్కరూ దీపాలను వెలిగించాలని, ప్రతి ఇంటా దీపాల వెలుగులు నిండాలని ఆకాంక్షించారు. వెలుగుల పండగను పర్యావరణహితంగా, ఆనందంగా జరుపుకోవాలని కోరారు.

స్త్రీశక్తికి ప్రతీక దీపావళి


మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

ఉదయగిరి: దీపావళిని పురస్కరించుకుని ఉదయగిరి నియోజకవర్గ ప్రజలకు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. నరకాసురుని వధించి లోకానికి విముక్తి కల్పించి శక్తిస్వరూపిణి సత్యభామ స్త్రీశక్తికి ప్రతీకగా నిలిచిందన్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా ప్రతిఒక్కరూ తమ ఇళ్లలో దీపాలను వెలిగించి పర్యవరణ హితంగా పండగను ఆనందంగా జరుపుకోవాలని కోరారు. ప్రతి ఇంటా దీపాలు కాంతులు వెలుగులు నింపాలని ఆకాంక్షించారు.

భక్తిశ్రద్ధలతో అంకాళమ్మకు పొంగళ్లు



సీతారామపురం : స్థానిక బెస్తకాలనీ సమీపంలో కొలువైన గ్రామదేవత అంకాలమ్మకు సామూహిక పొంగళ్ల కార్యక్రమాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఏటా దసరా పండగ ముగిసిన పదహారు రోజులకు గ్రామదేవతకు పొంగళ్లు పెట్టడం ఆనవాయితీ. అందులో భాగంగా గ్రామంలోని మహిళలు పొంగళ్ల సామగ్రిని కొత్త గంపల్లో పెట్టుకుని ఊరేగింపుగా అంకాలమ్మ ఆలయం వద్దకు చేరుకుని పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించారు.

డ్రైనేజీ నిర్మాణ పనుల ప్రారంభం



ఆత్మకూరురూరల్: మండలంలోని వాశిలి దక్షిణ వీధిలో డ్రైనేజీ నిర్మాణ పనులను ఆదివారం ప్రారంభించారు. మండల పరిషత్ నిధులతో డ్రైనేజీ నిర్మాణం చేపడుతున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సుదర్శన్ తెలిపారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతికి నివాళి



సీతారామపురం : సీతారామపురం బిట్– 2 గ్రామ సచివాలయ కన్వీనర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు కొండమూరి రమణయ్య(50) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని సీతారామపురం బిట్–1 ఎంపీటీసీ పీసీ అల్లూరు రాజు, పార్టీ మండల ఉపాధ్యక్షుడు రామిశెట్టి తిరుపతయ్య సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

మినీలారీ బోల్తా



దుత్తలూరు: మండలంలోని తెడ్డుపాడు సమీపంలో జాతీయ రహదారిపై మినీలారీ బోల్తా పడిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. కడప వైపు నుంచి ఒడిశాకు టమాటాల లోడు తో వెళ్తున్న మినీలారీ పిల్లాపేరు వంతెన సమీపంలోకి రాగానే అదుపుతప్పి రక్షణ గోడ ను ఢీకొని బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడ్ని హైవే అంబులెన్స్‌లో పామూరు వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టపాసుల విక్రయదారులు జాగ్రత్తలు పాటించాలి


ఆత్మకూరు:టపాసుల దుకాణాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ బీ పావని

ఆత్మకూరు: పట్టణంలోని ఎస్ఆర్‌జే కళాశాల ప్రాంగణంలో దీపావళి సందర్భంగా ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాలను ఆత్మకూరు ఆర్డీఓ బీ పావని, డీఎస్పీ కే వేణుగోపాల్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలను పాటించాలని, దుకాణాల వద్ద ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వారి వెంట సీఐ ఎం గంగాధర్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాలను ఎస్సై వీరప్రతాప్ ఆదివారం పరిశీలించారు. కొనుగోలుదారులు ఇబ్బందులు పడకుండా చూడాలని, ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని, ప్రతి దుకాణం వద్ద ఇసుక, నీరు అందుబాటులో ఉంచుకోవాలని దుకాణదారులకు సూచించారు. అనంతరం టపాసుల గోదామును పరిశీలించారు.

మర్రిపాడు : దీపావళి సందర్భంగా టపాసులను విక్రయించే వారు నిబంధనలు పాటించాలని ఎస్సై కాసుల శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. లైసెన్స్‌లు కలిగిన వారే టపాసులను విక్రయించాలని, లేకుండా విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా మండల ప్రజలకు ఎస్సై దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. పర్యావరణ హితంగా ఆనందోత్సవాలతో పండగను జరుపుకోవాలని కోరారు.

టపాసుల దుకాణాల పరిశీలన

కలిగిరి: స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం సమీపంలో దీపావళి టపాసుల దుకాణాలను ఎస్సై ఉమాశంకర్ ఆదివారం పరిశీలించారు. వ్యాపారులు టపాసులు కొనుగోలుకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు.



కూచిపూడి నృత్య పోటీల్లో చిన్నారుల ప్రతిభ



ఆత్మకూరు: పట్టణంలోని శ్రీభారతి సంగీత నృత్య విద్యాలయానికి చెందిన చిన్నారులు కూచిపూడి నృత్యంలో ప్రతిభకనబరిచారు. ఇటీవల చండీఘడ్‌లోని ప్రాచీన కళాకేంద్రంలో నిర్వహించిన పోటీల్లో తమ నృత్య కళను ప్రదర్శించి ప్రశంసాపత్రాలను అందుకున్నారు. ఈ సందర్భంగా నృత విద్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రతిభకనబర్చిన చిన్నారులను పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ డాక్టర్స్ వింగ్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జే ప్రణీత్, సీనియర్ నృత్య గురువు వేదాంతం విదుమౌళిలు అభినందించారు. చిన్నారులకు ప్రాచీన్ కళాకేంద్రం అందజేసిన సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. చిన్నారుల ద్వితీయ గురువు ఆనంద్‌ను అభినందించారు. నృత్య కళాశాల నిర్వాహకులు అపర్ణ, చక్రవర్తి, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పేదల భూములను పరిశ్రమలకు కేటాయించొద్దు


మాట్లాడుతున్న కాకు వెంకటయ్య

ఉదయగిరి రూరల్: శకునాలపల్లి, పుల్లాయపల్లె పంచాయతీల పరిధిలోని పేదల భూములను పరిశ్రమలకు కేటాయించడం దారుణమని రైతు సంఘం జిల్లా నాయకుడు కాకు వెంకటయ్య అన్నారు. మండలంలోని కురప్రల్లి బీసీ కాలనీలో శకునాలపల్లి, పుల్లాయపల్లె పంచాయతీలకు చెందిన బాధిత రైతులతో ఆదివారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం పేదలకు పంటల సాగు, నివేశన స్థలాల కోసం భూములను పంపిణీ చేసిందని తెలిపారు. ఈ భూములను పేదలకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా పరిశ్రమలకు కేటాయించడం దుర్మార్గమైన చర్య అన్నారు. జిల్లా అధికారులు స్పందించి పరిశ్రమలకు కేటాయించిన భూములను రద్దు చేయాలని, లేకపోతే దశలవారీగా ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎంపీటీసీ కాపు విజయమ్మ, సీపీఎం నాయకులు రమణయ్య, వెంకటేశ్వర్లు రైతులు పాల్గొన్నారు.

డైవర్షన్ రోడ్డులో ఇరుక్కున్న లారీ


డైవర్షన్ రోడ్డులో ఇరుక్కున్న లారీ


వర్షానికి రొచ్చురొచ్చుగా మారిన రోడ్డు

- కలిగిరి–కొండాపురం నడుమ రాకపోకలకు అంతరాయం

కలిగిరి: కలిగిరి నుంచి వలేటివారిపాళెం వరకు రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నారు. అందులో భాగంగా కలిగిరి సమీపంలోని చిన్నచెరువు వద్ద ప్రధాన రహదారిపై బ్రిడ్జి నిర్మాణ పనులు చేపడుతూ డైవర్షన్ రోడ్డును ఏర్పాటు చేశారు. వర్షాలకు మట్టి రోడ్డు బాగా నానిపోయి ఉండడంతో శనివారం రాత్రి కలిగిరి నుంచి కొండాపురం వైపు వెళుతున్న లారీ ఇరుక్కుపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఆదివారం రోడ్డు కాంట్రాక్టర్ స్పందించి నిర్మాణంలో ఉన్న బ్రిడ్జిపై తాత్కాలిక మరమ్మతులు చేపట్టి వాహనాల రాకపోకలకు సదుపాయం కల్పించారు. కాగా వర్షానికి బ్రిడ్జి వద్ద రోడ్డు రొచ్చురొచ్చుగా మారడంతో వాహనచోదకులు రాకపోకలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ద్విచక్ర వాహనచోదకుల పరిస్థితి మరింత దయనీయంగా కనిపించింది. ద్విచక్ర వాహనాలు జారుతుండడంతో తీవ్ర అవస్థలు పడ్డారు.

డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలి



కావలి(అల్లూరు): ఆర్టీసీ అద్దెబస్సుల డ్రైవర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు కృష్ణమోహన్, విజయ్, మధుసూదన్ రావు డిమాండ్ చేశారు. కావలి డిపోలో అద్దె బస్సుల డ్రైవర్ల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అద్దెబస్సుల డ్రైవర్లకు యజమానులు తక్కువ జీతాలను ఇస్తూ శ్రమను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. డ్రైవర్లకు కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం అద్దె బస్సు డ్రైవర్ల సంఘ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా పీ పెంచలయ్య, అధ్యక్షుడిగా ఎం రమేష్, ఉపాధ్యక్షులుగా పీ రాజేష్, కార్యదర్శి జీ హరి ప్రసాద్, జాయింట్ కార్యదర్శిగా కే శ్రావణ్ కుమార్, ట్రెజరర్‌గా ఆజాద్, తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వర్షం పడితే నరకమే



సంగం: సంగంలోని మెయిన్ రోడ్డు అధ్వానంగా తయారైంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్డు దెబ్బతిని భారీ గుంతలు ఏర్పడ్డాయి. ఈ గుంతల్లో వర్షపు నీరు చేరడంతో ఎక్కడ గుంత ఉందో..ఎక్కడ రోడ్డు ఉందో తెలియక వాహనచోదకులు రాకపోకలు సాగించేందుకు నరకాన్ని చూస్తున్నారు.